కల్లాలు దాటని కన్నీటి వ్యథలు

- రైతుకు దక్కని గిట్టుబాటు ధర
- వ్యాపారుల చెప్పిన రేటుకే గ్రామాల్లో ధాన్యం అమ్మకాలు
- అమలు కాని మద్దతు ధర
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు


పొలంలో ఆరబోసిన ధాన్యం

చేబ్రోలు: అష్టకష్టాలు పడి పంట సాగు చేసిన రైతుల కష్టాన్ని వ్యాపారులు దోచుకుంటున్నారు. ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటూ దగా చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు. చేబ్రోలు మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు ఈ ఏడాది 15వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. వాతావరణంలో మార్పులు, తుపాను హెచ్చరికలతో ఇప్పటి వరకు సుమారు పది వేల ఎకరాల్లో యంత్రాలతో త్వరితగతిన నూర్పిళ్లు పూర్తి చేశారు. నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో గత్యంతరం లేక తక్కువ రేటుకు ప్రభుత్వానికి అమ్ముకుంటున్నారు.

మొహం చాటేసిన ప్రభుత్వం

రైతుల్ని ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం మొహం చాటేసింది. గత ఏడాది ధాన్యం బస్తా ధర ప్రభుత్వ మద్దతు ధరకన్నా ఎక్కువగా ఉంది. బహిరంగ మార్కెట్లో వ్యాపారులు గత ఏడాది రూ.1900 నుంచి రెండు వేల వరకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది ఎకరానికి ఐదు నుంచి పది బస్తాల వరకు దిగుబడి తగ్గింది.


బస్తాలకు ఎత్తిన ధాన్యం

ప్రభుత్వం బస్తా రూ.1740 ప్రకటించినప్పటికీ బహిరంగ మార్కెట్లో వ్యాపారులు మాయాజాలం చేస్తున్నారు. రైతుల శ్రమను దోచుకుంటున్నారు. బస్తాను రూ.1300 వందల నుంచి 1400 వరకు మాత్రమే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. వర్ష సూచనలు, నిల్వ చేసే పరిస్థితులు లేని రైతులు వ్యాపారులు చెప్పిన రేటుకే అమ్ముకొని నష్టపోతున్నారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా కొనే పరిస్థితి లేదు.అక్కడ సవాలక్ష నిబంధనలు పెడుతున్నారు. రైతుల్ని ముప్పుతిప్పలు పెడుతున్నారు. ప్రస్తుతం వాతవరణ పరిస్థితులు అనుకూలించకపోవటంతో నిల్వ ఉంచితే మరింత నష్టపోవాల్సి వస్తుందన్న భయంతో వ్యాపారులు అడిగిన మేరకు కల్లాల్లోనే రైతులు తెగనమ్ముకుంటున్నారు. దీంతో బస్తా రూ. 300లకు పైగా రాబడిని కోల్పోతున్నారు.

వర్ష సూచనతో ఆందోళనలో రైతాంగం


ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాలలో నింపుతున్న రైతులు

పొన్నూరు: మండలంలో ప్రభుత్వపరంగా ధాన్యం కొనుగోళ్ల నత్తనడకన సాగుతుండటంతో రైతాంగం పూర్తిస్థాయిలో దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. మరో వైపు గురువారం మధ్యాహ్నం నుంచి కమ్ముకున్న మబ్బులకు భయపడి, హుటాహుటిన కల్లాల్లో ఆరబెట్టిన టన్నుల కొద్దీ ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సీజన్‌లో మండలంలో 27 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. పలు గ్రామాల్లో కోతలు పూర్తయ్యాయి. తేమ ఉండటంతో పొలాల పరిసరాల్లో ధాన్యాన్ని రైతులు ఆరబెట్టారు. ఇప్పటి వరకు మండల పరిధిలో 5 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి డేగల వెంకట్రామయ్య తెలిపారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ధాన్యం దిగుబడి గణనీ యంగా తగ్గిపోవడంతో పాటు, ధర పతనం అయిపో యింది. బహిరంగ మార్కెట్లో 75 కిలోల బస్తా రూ.1350లకు మా త్రమే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యాన్నిమద్దతు ధరకు సేకరించాలి.

– ఎర్రాకుల అనితా కుమారి, రైతు, చేబ్రోలు మండలం

పెట్టుబడులు కూడా కష్టం



ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం ఎకరానికి పది బస్తాల వరకు దిగుబడి తగ్గిపోవటంతో కౌలు, పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదు. ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు ఇవ్వలేదు. పైగా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదు.

– కె అజయ్, కౌలు రైతు, చేబ్రోలు మండలం

వ్యాపారులు చెప్పిన రేటుకే అమ్మకాలు



గత ఏడాది 75 కిలోల ధాన్యం బస్తా బహిరంగ మార్కెట్లో రూ.1900 ఉంటే ప్రస్తుతం రూ.1350లు మాత్రమే ఉంది. ప్రభుత్వ మద్దతు ధర ఆచరణలో అమలు జరగటం లేదు. రైతుల నుంచి ధాన్యం వ్యాపారుల చేతిలోకి వెళ్లిన తరువాత ధర పెరిగినా ప్రయోజనం లేదు.

– దానబోయిన గోపి, చేబ్రోలు మండలం

అన్ని విధాలా అండగా ఉంటాం



వరగాని(కాకుమాను):ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తుమాటి సంసోను, దేవరపల్లి జాన్ కుటుంబ సభ్యులను గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అన్ని విధాలా అండగా ఉంటామని, అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికాబద్ధ సన్నద్ధత

డీఈవీ సీవీ రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. గురువారం పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈవో సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-1) పరీక్షలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని, సబ్జెక్టుల వారీగా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే క్రమంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, పరీక్ష ముగిసిన తరువాత ప్రశ్నాపత్రాలు దిద్ది విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. విద్యార్థులు రాసిన తప్పులను సరిచేసి ప్రశ్నపత్రాలు వారితో చదవించాలని సూచించారు. డీఈవో వెంట హెచ్‌ఎం వసుంధర, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్లుప్తంగా

కిట్స్‌లో 75 మంది విద్యార్థుల రక్తదానం



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్‌ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కిట్స్) కళాశాలలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా వెల్ఫేర్ సొసైటీ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో కళాశాలకు చెందిన 75 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. బాబు మాట్లాడుతూ రక్తదానం ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరినో కాపాడుతుందని తెలిపారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ యువత సామాజిక బాధ్యతగా రక్తదానాన్ని తీసుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, అకడమిక్ డైరెక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతులు, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల ప్రతిభ



గుంటూరు రూరల్: జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో తమ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ, తృతీయ స్థానాలు సాధించటం గర్వకారణమని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి. సంధ్య పేర్కొన్నారు. గోరంట్లలోని కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విజేతల అభినందనలో ఆమె మాట్లాడారు. ఇటీవల నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన పోటీలలో విద్యార్థినులు పి.నాగమణి, జి.లక్ష్మీదేవమ్మ ఉత్తమ ప్రతిభను కనబరిచి స్వర్ణ, కాంస్య పతకాలను సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల పీడీ జి. బాలశౌరిరెడ్డి, అసిస్టెంట్ పీడీ కె. సుస్మిత, అధ్యాపకులు అభినందించారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ

లక్ష్మీపురం: తోడు నీడు లేక వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వృద్ధులకు ప్రతి ఒక్కరూ సహాయ, సహకారాలు అందించాలని చిన్నం సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ న్యాయవాది చిన్నం మురళీధర్ తెలిపారు. స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డులోని సోమేపల్లి కాలనీలోని హ్యాపీ కేర్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చిన్నం సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ తరపున గురువారం వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ పుట్టిన రోజు, పెళ్లి రోజులకు ప్రతి ఒక్కరూ వద్ధాశ్రయాలలో అన్నదానం చేయాలని కోరారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది గుజ్జుల పాండురంగారెడ్డి, ఆడిటర్లు ఎం.ఎస్.ఖాన్, ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 131 మంది విద్యార్థినుల ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో ఉన్న జవహర్ విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 131 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తెలిపారు. నియో లింక్ టెలీ కమ్యూనికేషన్స్‌లో అసెంబ్లింగ్ ఆపరేటర్ పోస్టు కోసం నిర్వహించిన మౌఖిక పరీక్షల్లో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 58 మంది, హీరో మోటో కార్ప్స్‌లో ప్రొడక్షన్ ఆపరేటర్ పోస్టుకు 73 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో హీరో మోటో కార్ప్స్ హెచ్‌ఆర్ మేనేజర్ సురేష్, జేకేసీ సమన్వయకర్త అపర్ణా సీతారామ్, జేకేసీ మెంటార్లు యూనిస్‌ఖాన్, అపర్ణ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమద్భాగవతం ప్రవచనాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తోన్న శ్రీమద్భాగవతం ధారావాహిక ప్రవచనాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు బ్రహ్మశ్రీ మల్లాది కైలాసనాథ్ ప్రసంగిస్తూ శ్రీమద్భాగవతం హిందూ మతం, ధర్మశాస్త్రం, సంప్రదాయం, సాహిత్యం, ఆలోచనా విధానంలో ముఖ్యమైన ప్రభావం కలిగిన ఒక పురాణమని చెప్పారు. భగవంతుని కథగా, భగవంతునికి శరణాగతులైన భక్తుల కథగా భక్తి యోగాన్ని చాటి చెప్పే ప్రాచీన గాథ అని పేర్కొన్నారు. ప్రధానంగా విష్ణువు, కృష్ణుడు, ఇతర భాగవత అవతారాలను ఈ గ్రంథంలో చెప్పారని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య పాల్గొన్నారు. అనంతరం మల్లాది కైలాసనాథ్‌ను సత్కరించారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

పొన్నూరు: గ్రామాల్లో భూముల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. మండలంలోని వెల్లలూరు గ్రామంలోని సచివాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూముల సమస్యలపై అర్జీలు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. అనంతరం మ్యుటేషన్, పాస్‌బుక్స్, అడంగల్ కరెక్షన్, కులం, ఆదాయం, డిజిటల్ సిగ్నేచర్, ఆధార్ సీడింగ్, డూప్లికేట్ పట్టా, ఎఫ్‌ఎంసీలకు సంబంధించి 100 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ సత్యనారాయణ, ఆర్‌ఐ శ్రీనివాస్, సర్వేయర్, సీనియర్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పాంఢ్రపాడు(కాకుమాను): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకుని భూ సమస్యల్ని పరిష్కరించుకోవాలని తహసీల్దార్ బి.వెంకటస్వామి సూచించారు. మండలంలోని పాంఢ్రపాడు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలను సదస్సులో రైతులకు సంబంధించిన అర్జీల రూపంలో అందజేసి వాటిని శాశ్వతంగా పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా భూమి కొలతలకు సంబంధించి మూడు అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మోహనరావు, సర్పంచ్ దేవిరెడ్డి సాంబయ్య, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు


పాంఢ్రపాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి: సీపీఎం

పెదకాకాని: కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదకాకాని మండలంలోని గోళ్లమూడి రోడ్డులో గురువారం రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ 75 కిలోలు బస్తాను మద్దతు ధర రూ.1740కు కొనాల్సి ఉండగా, కేవలం రూ.1320 నుంచి రూ.1400కు రైతులు అమ్ముకోవాల్సి వస్తోందని తెలిపారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ధాన్యం తడిసిపోతుందనే ఆందోళనతో యంత్రాల ద్వారా కోతలు కోసి, పట్టాలపై ఆరబెడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆరుగాలం శ్రమించిన రైతులు బస్తాకు రూ. 400 వరకూ నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది కురిసిన అధిక వర్షాల కారణంగా ధాన్యం దిగుబడి కూడా తగ్గిందని, కౌలు రైతులు పరిస్థితి మరింత దారుణంగా ఉందని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రకటనలు చేయడంలో వాస్తవం లేదని తెలిపారు. 80 శాతం ధాన్యం వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలు పెట్టి నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పత్తి, మిర్చి, మినుము, శనగ పంటలను కూడా మద్దతు ధరకు కొనాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు రాజారమేష్, కొల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

నల్లపాడు అర్బన్ హెల్త్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

గుంటూరు రూరల్: నల్లపాడు పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ కె.వి.ఎస్.ఎస్. అనిల్ కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వ్యాక్సిన్స్ కోల్డ్ చైన్ సిస్టం, ఓపీ, మందుల విభాగం, ల్యాబ్ పరీక్షలు తదితర వాటిని పరిశీలించారు. సురక్షిత ప్రసవ క్యాలెండర్, హెచ్.ఎం.ఐ.ఎస్ పోర్టల్‌లో పలు సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ప్రాంతీయ ఆరోగ్య కుటుంబ కార్యాలయంలో ఎల్.హెచ్.వి శిక్షణ పొందుతున్న రెండవ బ్యాచ్ మహిళ ఆరోగ్య కార్యకర్తల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జ్యోత్స్న, స్టేట్ కిల్కారి కోఆర్డినేటర్ సి. ఎల్. రాజు, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్

కొత్త రసాయన చర్యల ఆవిష్కరణ సాధ్యమే..

ఐఐఎస్‌సీ బెంగళూరు ప్రొఫెసర్ ఏటీ.బిజు


సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్లు, అతిథులు

చేబ్రోలు: ఆర్గానో క్యాటలిసిస్ ద్వారా అనేక కొత్త రసాయన చర్యలను ఆవిష్కరించడం సాధ్యమవుతోందని, ఇవి పరిశోధనలో నూతన మార్గాలను తెరవగలవని ఐఐఎస్‌సీ బెంగళూరు ప్రొఫెసర్ ఏటీ.బిజు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇండో-ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ సెమినార్ ఆన్ "ఎక్స్‌ప్లోరింగ్ కాంటెంపోరరి విస్టాస్ ఇన్ అప్లైయింగ్ (ఆర్గానో) కాటలిసిస్ ఫర్ ఫార్మా ఇండస్ట్రీ: ఫర్ సస్టేయినింగ్ ఫ్యూచర్" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్నేషనల్ సెమినార్ రెండో రోజు గురువారం ఘనంగా జరిగింది . కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్ బిజు మాట్లాడుతూ ఆర్గానో క్యాటలిసిస్ అనేది ఒక ప్రత్యేకమైన రసాయన పద్ధతని తెలిపారు. ఔషధ సంశ్లేషణ వేగంగా, సమర్థంగా జరుగుతుందన్నారు. ఇది పరిశోధన, పరిశ్రమల్లో అనేక రకాలుగా ఉపయోగపడుతుందని, కొత్త రకాల ఔషధాల అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. భోపాల్‌లోని ఐఐఎస్ఈఆర్ ప్రొఫెసర్ నితిన్ టి.పాటిల్ మాట్లాడుతూ రసాయన శాస్త్ర పరిశోధనలు రోజురోజుకూ వినూత్నంగా అభివృద్ధి చెందటంతో పాటు ఔషధ తయారీ, సేంద్రియ రసాయన శాస్త్రం, మెటీరియల్స్ సైన్స్, కేన్సర్, మధుమేహం, న్యూరోడీజెనరేటివ్ వ్యాధులకు సంబంధించి మందులను రూపొందించడంలో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. పర్యావరణ హాని లేకుండా స్వచ్ఛమైన సమ్మేళనాలను తయారుచేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆహారంలో రుచిని, రంగును మెరుగుపరిచే రసాయనాలను తయారు చేయడంలో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ ఎస్.భాస్కర్, ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, ప్రొఫెసర్ జి.శేఖర్, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

పంచాయతీల ఆర్థికాభివృద్ధికి పాటుపడాలి


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మండల స్థాయి అధికారులు

గుంటూరు రూరల్: గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని మండల అభివృద్ధి అధికారి బండి శ్రీనివాసరావు సూచించారు. రాష్ట్ర గ్రామ స్వరాజ్ అభియాన్ నిధులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అనే అంశంపై మండల స్థాయి అధికారులకు, సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి రెండు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. నగరంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ తరగతులలో ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి, మెరుగైన జీవనోపాధుల కల్పన, ఆరోగ్యవంతమైన, బాలహిత సమాజం, సమృద్ధిగా తాగునీరు, పచ్చదనం, పరిశుభ్రత, స్వయం సమృద్ధిగా మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక న్యాయం, భద్రత కలిగిన సుపరిపాలన, మహిళలకు స్నేహపూర్వక వాతావరణం తదితర అంశాలపై శిక్షణ పొందిన మండల స్థాయి అధికారులు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజినల్ పంచాయతీ అధికారి కె. శ్రీనివాసరావు, ఏపీఎస్ఐఆర్‌డీ ప్రతినిధి మోహన్‌రావు, విస్తరణాధికారి కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాకుమానులో..

ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని ఈఓపీఆర్డీ రవిబాబు అన్నారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది,వివిధ శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి అధికారి తన వంతు కృషి చేయాలని తెలిపారు.

కిశోర బాలికల్లో రక్తహీనత అధికం

ప్రత్తిపాడు: పదకొండు నుంచి పద్దెనిమిది సంవత్సరాల వయస్సున్న కిశోర బాలికల్లో 60 శాతం మంది రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి. మాధవి అన్నారు. జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్తిపాడు సెక్టారు పరిధిలోని ఉప్పరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో, గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని పాతమల్లాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, ఆడపిల్లల్లో ఎదురయ్యే దుష్ప్రభావాలను తల్లులు, మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయా సెక్టార్‌ల సూపర్‌వైజర్లు ఎస్. భారతి, పి. మాధవి మాట్లాడుతూ ప్రాథమిక విద్యలో వంద శాతం నమోదవుతున్న బాలికల సంఖ్య, ఉన్నత విద్యకు వచ్చేసరికి 76 శాతానికి పడిపోతోందని తెలిపారు. తల్లిదండ్రులు ఆదుర్దాతో బాలికలకు పద్దెనిమిది సంవత్సరాలు నిండకముందే వివాహం చేస్తున్నారని చెప్పారు. బాల్య వివాహాల వల్ల అనారోగ్యంతో పాటు రక్తహీనత సమస్యలు ఉత్పన్నమవుతాయని వివరించారు. మాతా శిశుమరణాలు, లోపాలతో శిశువులు జన్మిస్తారని, అందు వల్ల మహిళలు, తల్లులు ఆలోచించాలని వారు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, అనూరాధ పాల్గొన్నారు.


బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మహిళలతో ప్రమాణం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

ఎస్‌ఏ-1 పరీక్షల తనిఖీ

కాకుమాను: ఎస్‌ఏ-1 పరీక్షలను ఉపాధ్యాయులు సమర్థంగా నిర్వహించాలని ఎంఈఓ కెఎఫ్.కెనడీ తెలిపారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షల నిర్వహణను ఆయన పరిశీలించారు. పరీక్షలను పక్కాగా, పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్, హెచ్‌ఎం బి.సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిండి లేదు.. వసతులు లేవు

గుంటూరు రూరల్: జిల్లాలు దాటి వచ్చారు.. అందరూ ప్రభుత్వ ఉద్యోగులే ముఖ్యమంత్రి మీటింగ్‌కు వచ్చారు. కానీ వారికి కనీస వసతులు కరువయ్యాయి. ఇది ఏంటని ప్రశ్నిస్తే ఒక కల్యాణ మండపంలో అందరిని నెట్టి తలుపులేశారు. రాత్రి 9 గంటలకు వచ్చినవారికి రాత్రి 11 గంటల తరువాత భోజనాలు పెట్టారు. ఎదురు తిరిగి ఇదేంటని ప్రశ్నించినవారిని గమ్మున కూర్చోమన్నారు. వివరాల్లోకి వెళితే శుక్రవారం విజయవాడ నగరంలో ముఖ్యమంత్రి ఆధ్వర్యాన జరుగుతున్న మీటింగ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలనుంచి ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు ఇతర శాఖల ఉద్యోగులను భారీగా బస్సుల్లో తరలించారు. వారందరిని నగర శివారుల్లోని చిలకలూరిపేట బైపాస్ రోడ్డు హైవే పక్కనే ఉన్న ఒక కల్యాణ మండపంలో బస ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలకు కనీసం తిండి, నిద్రపోయేందుకు ఏర్పాట్లు చేయలేదు. దీంతో పలు జిల్లాలనుంచి వచ్చిన వారు ఇదేంటని ప్రశ్నించటంతో స్థానికంగా ఉన్న అధికార పార్టీ నాయకులు అందరిని కల్యాణ మండపంలోకి పంపి తలుపులేశారు. అర్ధరాత్రి సమయంలో భోజనం రావడంతో అప్పుడు తిన్నారు. అనంతరం పడుకునేందుకు కనీస వసతి లేక కల్యాణ మండపంలో నేలపై కార్పెట్లు వేసుకుని పడుకున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకే ఇటువంటి పరిస్థితి ఎదురైతే సామాన్యుల పరిస్థితి ఏంటని వారిలో పలువురు చర్చించుకున్నారని సమాచారం. అడిగితే ఎవరి ఉద్యోగానికి ఎసరు వస్తుందోనని ప్రతి ఒక్కరూ మిన్నకుండినట్లు సమాచారం.

పది విద్యార్థులకు మోడల్ పేపర్ బుక్స్ పంపిణీ



ప్రత్తిపాడు: పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని గొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వేణుగోపాలరావు తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయురాలు టి.వినోద సహకారంతో సమకూర్చిన యూటీఎఫ్ మోడల్ పేపర్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ మోడల్ పేపర్లను చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు, గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.